సాక్షి
వికారాబాద్
ఆదివారం । 2 । మార్చి । 2025



సౌకర్యాలు కల్పించండి

రంజాన్ ఉపవాస దీక్షలకు సౌకర్యాలు కల్పించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸




ప్రభుత్వ బడుల్లోనే..

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి విజయరామారావ్ అన్నారు. 8లో▸



నర్సరీల్లో మొక్కలు సిద్ధం

రాష్ట్రంలో అడవుల శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 9లో▸



న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం స్వామి వారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. భక్తులకు శ్రీవారు నిజ రూపంలో దర్శనం ఇచ్చారు. శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిత్య పూజలు, కైంకర్యాలు జరిగాయి. విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో స్వామివారి మూలమూర్తికి అభిషేకం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేటి నుంచి సత్యాహరిశ్చంద్ర వీధినాటకం

యాలాల: మండలంలోని రాస్నం గ్రామంలో ఆదివారం నుంచి సత్యాహరిశ్చంద్రుడి వీధి నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహణ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2 నుంచి 10వ తేదీ వరకు రోజు విడిచి రోజు రాత్రి ప్రదర్శన ఉంటుందన్నారు. సత్యాహరిశ్చంద్రుడి జీవిత చరిత్ర ఆధారంగా వివిధ భాగాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని యువకులు, వయోజనులు పాత్రధారులుగా ఉంటారని తెలిపారు.

మగ్గంపై ఉచిత శిక్షణ

అనంతగిరి: మగ్గం పని నేర్చుకునేందుకు స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్ట్ యూనియన్ డైరెక్టర్ జీఎస్ఆర్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్ట్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వర్ణ భారత్ ట్రస్టు, ముచ్చింతల, శంషాబాద్ నందు మార్చి 3నుంచి 30 రోజులపాటు ఉచిత శిక్షణ శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ల 7893121143, 9391487797, 9177141712లో సంప్రదించాలని కోరారు.

యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



అనంతగిరి: ప్రత్యేక వైకల్య గుర్తింపు(సదరం) కార్డు కోసం యూడీఐడీ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తెలిపారు. శనివారం నగరం నుంచి సదరం క్యాంపులు, ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై జిల్లా కలెక్టర్లు, డీఆర్డీఓ, డీడబ్ల్యూఓ, డీసీహెచ్ఎస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్లతో సెర్ప్ సీఈవో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూడీఐడీ పోర్టల్‌పై దివ్యాంగులకు అవగాహన కల్పించాల న్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్, జిల్లా సంక్షేమ అధికారి ఉమాహారతి, డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

4న ఉపకరణాల పంపిణీ

చేవెళ్ల: కృతిమ అవయవాల తయారీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో వయోవృద్ధులు, దివ్యాంగులకు కావాల్సిన ఉపకరణాలను ఉచితంగా అందజేయనున్నట్లు చేవెళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ హెప్సిబా తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాలతో చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాలకు చెందిన వయోవృద్ధులకు చేతికర్రలు, వాకర్స్, వినికిడి యంత్రాలు, దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్లు, కాలిపర్స్ కృత్రిమ కాళ్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 4న చేవెళ్లలోని అట్లాస్ మినీ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

జలం.. పాతాళం

అడుగంటుతున్న భూగర్భ నీటి మట్టం

- నెలరోజుల్లోనే రెండు మీటర్ల లోపలికి..
- మర్పల్లి, దుద్యాల్ మండలాల్లో 20 మీటర్ల లోతుకు పడిపోయిన వైనం
- దిద్దుబాటు చర్యల్లో అధికారులు విఫలం

వికారాబాద్: రోజురోజుకూ ఎండల తీవ్రత పెరిగిపోతుండటంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. పంటలు, తాగునీటి అవసరాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బావులు, బోర్లలో నీటి మట్టం పడిపోయి పంటలు ఎండిపోతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు, వంకల్లో నీరు లేక పోవడంతో మూగజీవుల దాహార్తి తీర్చటం రైతులకు కష్టంగా మారింది. గతేడాదితో పోలిస్తే ఈ సారి 0.37 మీటర్లు ఎక్కువ లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. మార్చి ఆరంభంలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మే నెలాఖరుకు పరిస్థితి ఇంకా ఎలా ఉంటుందోననే ఆందోళన కనిపిస్తోంది. దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అధికారులు కంటితుడుపు చర్యలతో సరిపెడుతున్నారు. ఇంకుడు గుంతలు మచ్చుకైనా కనిపించటంలేదు. జిల్లాలో వేల ఇంకుడు గుంతలు తవ్వామని చెబుతున్న అధికారులు వాటి నిర్వహణను గాలికొదిలేస్తున్నారు. చెక్ డ్యామ్‌లు, ఫాంపాండ్స్, చెరువులు, కుంటల్లో పూడిక తీయకపోవడంతో అవి నామమాత్రంగా మారాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు వాటివైపు కూడా చూడటంలేదు. భూగర్భ జలాలు సాధారణ స్థాయి కంటే ఎక్కువగా అడుగంటిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. మరో పక్క కొందరు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా బోరు బావులు తవ్వుకుంటూపోతున్నారు.

గతేడాదితో పోలిస్తే..

గతేడాదితో పోలిస్తే భూగర్భ జలాలు ఈ సారి ఎక్కువగా అడుగంటాయి. 2024 ఫిబ్రవరి మాసంలో జిల్లాలో సగటున 13.21 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోగా ఈ ఏడాది అదే ఫిబ్రవరి నెలాఖరుకు 13.58 మీటర్ల లోతుకు పడిపోయాయి. దుద్యాల్ మండలంలో అత్యధింగా సగటున 29.88 మీటర్ల లోతుకు అడుగంటాయి. గత జనవరి చివరి వారంతో పోలిస్తే ఈ నెల 1.29 మీటర్ల లోతుకు జలాలు పడిపోయాయి. మర్పల్లి మండలంలోనూ సగటున 22.39 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఈ మండల పరిధిలోని నర్సాపూర్‌లో 28 మీటర్లలోతుకు అడుగంటాయి. జిల్లాలో రెండు మూడు మండలాలు మినహా మిగతా అన్ని మండలాల్లో సాధారణ స్థాయి కంటే పడిపోయినట్లు భూగర్భ జల వనరుల శాఖ నివేదికలు చెబుతున్నాయి. సాధారణంగా ఫిబ్రవరి నెలాఖరు, మార్చి మొదటి వారంలో వరి పంట కోతలు మొదలవుతాయి. ఈ సమయంలో నీటి వాడకం కూడా చాలా తక్కువగా ఉంటుంది. ఇలా నీరు తక్కువగా వాడే సమయంలోనే భూగర్భ జలాలు అడుగంటిపోతే ఏప్రిల్, మే మాసాల్లో పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందోననే ఆలోచనే ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది రబీ సీజన్‌లో అంటే సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో, ఆ తర్వాత కూడా వర్షాలు కురిసినప్పటికీ ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి మాసం మొదటి నుంచే తీవ్ర రూపం దాల్చటంతో నీటి వనరులపై ప్రభావం పడింది.

పొదుపుగా వాడుకోవాలి



భూగర్భ జల వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ప్రధానంగా ఇంకుడు గుంతలు తవ్వటంతో పాటు నిర్వహణ సక్రమంగా ఉండాలి. కుంటలు, చెరువులు, ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లలో పూడిక తీసి నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాలి. నీటిని పొదుపుగా వాడుకోడం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గుర్తించాలి. అయితే చాలా మంది ఎలాంటి అనుమతులు లేకుండానే బోరుబావులు తవ్వుతున్నారు. తమను సంప్రదిస్తే అనుమతులతోపాటు బోరు వేయాలనుకునే ప్రాంతంలో నీరు ఉందో లేదో పరీక్షలు జరిపి నివేదిక ఇస్తాం. దీంతో ఎవ్వరికీ ఇబ్బంది ఉండదు.

– రవిశంకర్, జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్



ఉచిత ఔషధాల పంపిణీపై ఆరా తీస్తున్న కేరళ బృందం సభ్యులు


ఆయుష్మాన్ సేవలు భేష్

- పీఆర్సీ కేరళ బృందం సభ్యుడు రాజేష్ కితాబు
- వసతి కల్పన, సిబ్బంది నియామకానికి సిఫార్సు

తాండూరు టౌన్: అయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో వైద్య సేవలు భేషుగ్గా ఉన్నాయని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ కేరళ బృంద సభ్యుడు డాక్టర్ రాజేష్ తెలిపారు. శనివారం ఆయన తాండూరు పట్టణం రాఘవేంద్ర కాలనీలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సందర్శించారు. వైద్యం కోసం వచ్చిన రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. డాక్టర్‌తో పాటు ఇతర వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న ఔషధాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర కుటుంబ, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పనితీరు తెలుసుకునేందుకు వచ్చామన్నారు. రోగులకు అందుతున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో ముఖ్య పాత్ర వహించే సౌకర్యాలు, వసతులు, వైద్య సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై రాష్ట్ర వైద్య విధాన పరిషత్ అధికారులకు నివేదిక ఇస్తామన్నారు. ఆరోగ్య మందిర్‌లో అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు కావాల్సిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆయనతో పాటు పీఆర్సీ బృంద సభ్యుడు సురేష్, డిప్యూటీ డీఎం హెచ్‌ఓ రవీందర్ యాదవ్, వైద్యులు గిరిధర్, పవిత్ర, బుచ్చిబాబు, బీబీ జాన్, నిరోష, రవీంద్ర తదితరులు ఉన్నారు.

కనిపించిన నెలవంక..

- నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు
- ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమైన మందిరాలు



తాండూరులో కనిపించిన నెలవంక

తాండూరు: రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. శనివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక కనిపించింది. దీంతో ముస్లింలు సంబరాలు చేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి 30 రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరిస్తారు. ఈ పవిత్ర మాసంలో ప్రత్యేక ప్రార్థనలు చేయడం, అబద్ధం ఆడకుండా ఉండటం, దానధర్మాలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెలలో ఖురాన్ పఠిస్తే మోక్షం లభిస్తుందని ముస్లింల నమ్మకం. ఇస్లాం ధర్మసూత్రాలలో భాగంగా ప్రతి ఒక ముస్లిం ప్రవక్తపై విశ్వసం, రోజూ 5 సార్లు నమాజ్ చేయడం, రంజాన్ నెల మొత్తం ఉపవాస దీక్షలు చేయాలని నమ్ముతారు. తాండూరు నియోజకవర్గంలో రంజాన్ సందడి ప్రారంభమైంది. పట్టణంలో దాదాపు 20, బషీరాబాద్, యాలాల, పెద్దేముల్ మండలాల్లో 90కి పైగా ప్రార్థనా మందిరాలు ఉన్నాయి. పలు చోట్ల హలీం, హరీస్ దుకాణాలు వెలిశాయి.

భర్త నెట్టేయడంతో..

భార్యకు తీవ్ర గాయాలు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- అల్లుడే కొట్టి చంపాడని మృతురాలి తండ్రి ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు

తాండూరు రూరల్: అదనపు కట్నం తేవాలంటూ భార్యను భర్త నెట్టేయడంతో ఆమె తలకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పెద్దేముల్ మండలం హన్మాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. పెద్దేముల్ ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పసుల ప్రవీణ్‌కుమార్, కల్పనకు తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు. కొన్నేళ్లుగా ప్రవీణ్‌కుమార్ అదనపు కట్నం తేవాలని భార్య కల్పనను వేధిస్తున్నాడు. గతేడాది డిసెంబర్‌లో భర్త వేధింపులు భరించలేక కల్పన కర్ణాటక రాష్ట్రం బూర్గుపల్లిలోని పుట్టింటికి వెళ్లింది. అప్పట్లో కుటుంబ సభ్యులు పంచాయితీ పెట్టి సముదాయించారు. ఇటీవల ప్రవీణ్‌లో అదనపు కట్నం కోసం భార్యను శారీరకంగా, మానసికంగా వేధించసాగాడు. శుక్రవారం రాత్రి దంపతుల మధ్య గొడవ జరిగింది. భార్య కల్పనను బలంగా తోయడంతో రోడ్డుపై పడింది. ఆమె తలకు తీవ్రగాయం కావడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. అదనపు కట్నం కోసం తన కూతుర్ని అల్లుడే కొట్టి చంపాడని మృతురాలి తండ్రి నాగప్ప పెద్దేముల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడు ప్రవీణ్ గతంలో గ్రామంలో జరిగిన ఓ హత్య కేసులో ప్రధాన నిందిడుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు.

బిల్లులు రాక.. అప్పులు తీరక!

- మనఊరు – మనబడి పథకానికి నిధుల కొరత
- చేసిన పనులకు బిల్లులు రాలేదని కాంట్రాక్టర్ల ఆవేదన
- రోజుల తరబడి కలెక్టర్ లాగిన్‌లోనే ఫైళ్లు
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



ఇటీవల ట్రైనీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

దోమ: మనఊరు – మనబడి పథకం కింద పలు పాఠశాలల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు బిల్లులు రాక.. చేసిన అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నారు. చిన్న చిన్న బిల్లుల కోసం జిల్లా స్థాయి అధికారుల వద్దకు తిరగాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇటీవల బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఏఐ డిజిటల్ తరగతుల ప్రారంభోత్సవానికి వచ్చిన ట్రైనీ కలెక్టర్ ఉమాహారతికి దోమ, చౌడాపూర్, కుల్కచర్ల మండలాల కాంట్రాక్టర్లు వినతిపత్రాన్ని అందజేసి తమ గోడును వెల్లబోసుకున్నారు.

మూడు మండలాల్లో 64 స్కూళ్లు ఎంపిక

మన ఊరు – మనబడి పథకం కింద దోమ, కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లో 64 స్కూళ్లను ఎంపిక చేశారు. సుమారు రూ.17 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. పాఠశాలల్లో అదనపు గదులు, ప్రహరీలు, భవనాలకు రంగులు, ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించారు. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల్లోని కొన్ని స్కూళ్లలో పనులు పూర్తి చేయగా, మరికొన్ని బిల్లులు రాక మధ్యలోనే వదిలేశారు. దోమ మండలం శివారెడ్డిపల్లి, బొంపల్లి తండా పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగత స్కూళ్లల్లో అసంపూర్తిగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు బిల్లులు వచ్చేలా చూడాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

రూ.25 లక్షలు రావాలి



బొంపల్లి జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి పనులకు రూ.54 లక్షలు కేటాయించారు. ఆ పాఠశాలల్లో ప్రహరీలు, ఫర్నిచర్, విద్యుత్, తాగునీరు వంటి వసతులు కల్పించాం. అప్పులు తెచ్చి పనులు చేశాం. ఇప్పటివరకు బిల్లులు సక్రమంగా రాలేదు. రూ.25 లక్షలు రావాల్సి ఉంది.

– బోయిని చంద్రశేఖర్, వార్డు మాజీ సభ్యుడు, బొంపల్లి

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం



ముజాహిద్‌పూర్ పాఠశాలలో రూ.32 లక్షల విలువ చేసే పనులు పూర్తి చేశా. రూ.20 లక్షలు రావాలి. భార్య బంగారం తాకట్టు పెట్టి పనులు చేశా. బిల్లులు రాకపోవడంతో వడ్డీ కట్టలేకపోతున్నాం. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకుంటే అప్పులపాలవుతాం.

– చిట్యాల వెంకటయ్య, ముజాహిద్‌పూర్, కాంట్రాక్టర్

బిల్లులు చెల్లించాలి



ఎంవోఎంబీ కింద జిల్లాలోని అన్ని పాఠశాలలో కాంట్రాక్టర్లు దాదాపు 80 శాతం పనులు చేశారు. సీఎం సొంత నియోజకవర్గంలో మాత్రమే బిల్లులు చెల్లించారు. ఇది ఎంత వరకు సమంజసం. ఇప్పటికైనా ప్రభుత్వం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి. లేకుంటే వీధిన పడతాం.

– వెంకటయ్య, మల్లేపల్లి, కాంట్రాక్టర్

వందశాతం పన్నులు వసూలు చేస్తాం

- ఫిబ్రవరి చివరి నాటికి రూ.8.12కోట్లు వసూలు చేశాం
- ఈ నెలాఖరులోగా లక్ష్యం చేరుకుంటాం
- తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళిక
- జిల్లా పంచాయతీ అధికారి జయసుధ వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న డీపీఓ జయసుధ

బషీరాబాద్: జిల్లాలో ఇంటి పన్నుల వసూలులో పంచాయతీ అధికారుల రికార్డు నెలకొల్పారు. 594 గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.9.56 కోట్లు లక్ష్యం కాగా ఫిబ్రవరి చివరి నాటికి రూ.8.126 కోట్లు వసూలు చేసినట్లు డీపీఓ జయసుధ తెలిపారు. ప్రత్యేక ప్రణాళికతో కార్యదర్శులు పట్టుబట్టి టార్గెట్‌కు చేరువయ్యారని పేర్కొన్నారు. ఈ నెలాఖరుకు మిగిలిన రూ.1.38 కోట్లు వసూలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఇంటి, ఇతర పన్నులు చెల్లించి సహకరించాలని కోరారు. అలాగే ప్రస్తుత వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ప్రతి మండల పరిషత్ కార్యాలయంలో 5 మోటార్లు సిద్ధం చేస్తామన్నారు. ఎక్కడైనా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోతే అక్కడ బోరుబావుల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే జిల్లాలోని 406 తొట్లను రోజూ నీటితో నింపి ఉంచాలని కార్యదర్శులకు ఆదేశించినట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల లెక్కలు తేలకపోవడంతో ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు తాత్కాలికంగా వాయిదా వేసిందని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. పంచాయతీలకు ప్రజాప్రతినిధులు లేకపోవడం వలన కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు రూ.60 కోట్లు, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు మరో రూ.10 కోట్ల వరకు నిలిచిపోయాయని వివరించారు.

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణకు 16,229 దరఖాస్తులు

జిల్లాలో ఎల్ఆర్ఎస్ (క్రమబద్ధీకరణకు)కు 16,229 మంది దరఖాస్తు చేసుకున్నట్లు డీపీఓ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అన్నీ పరిశీలించి ఏప్రిల్ మాసంలోపు వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఈ భూమి ప్రభుత్వానికి చెందినది

- భూదాన్, సీలింగ్ భూముల్లో సూచిక బోర్డులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పిగ్లీపూర్ గ్రామం సర్వే నంబర్ 17లో గల భూదాన్, సీలింగ్ భూముల్లో శనివారం మండల రెవెన్యూ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. భూదాన్, సీలింగ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్న ఫిర్యాదులతో తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు సర్వేయర్ జ్యోతి, ఆర్ఐ నిజాముద్దీన్ సిబ్బందితో కలిసి సూచిక బోర్డులను నాటారు. సర్వే నంబర్ 17/2,3లలోని 116.10 ఎకరాల సీలింగ్ భూమి, 17/పార్ట్‌లోని 60 ఎకరాల భూదాన్ భూములకు హద్దులు ఏర్పాటు చేసి హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. పైన పేర్కొన్న సర్వే నంబర్లలోని భూములన్నీ ప్రభుత్వానికి చెందినవని ఈ భూములపై ఎలాంటి లావాదేవీలు జరపకూడదని ఆయన హెచ్చరించారు.



మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

- కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి
- నిర్వాసితులతో అభిప్రాయ సేకరణ

కొడంగల్: పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న 93 మంది నిర్వాసితుల నుంచి శనివారం అభిప్రాయాలు సేకరించారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీవారి ఆలయాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం వచ్చిందన్నారు. అందరూ సహకరించాలని కోరారు. తిరుమల తరహాలో కొడంగల్ ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న 93 మందికి జాతర మైదానంలో లే అవుట్ చేసి ఇండ్లు కట్టించి ఇస్తామని తెలిపారు. అందరి అభిప్రాయాలను సేకరించిన తర్వాత ముఖ్యమంత్రికి నివేదిక ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మళ్లీ సమావేశం ఏర్పాటు చేసి అన్ని విషయాలు వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మాజీ కౌన్సిలర్లు మధుయాదవ్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై కళాజాత ప్రదర్శన



మాట్లాడుతున్న ఎస్ఐ రవిగౌడ్

దౌల్తాబాద్: సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రవిగౌడ్ సూచించారు. ఆడపిల్లలపై వివక్ష, రెండుగ్లాసుల విధానం, బాల్యవివాహాలు తదితర అంశాలపై కళాజాత బృందం అవగాహన కల్పించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ముత్తురాజు, హెడ్‌కానిస్టేబుల్ దాసు, సిబ్బంది, కళాజాత బృందం పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు రిమాండ్



మైనొద్దీన్

తాండూరు రూరల్: తండ్రీకొడుకుల మృతికి కారణమైన లారీ డ్రైవర్ మైనొద్దీన్‌ను రిమాండ్‌కు తరలించినట్లు కరన్ కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి శనివారం తెలిపారు. తాండూరు మండలం చెంగోల్ గ్రామానికి చెందిన ఈడ్గి గోపయ్యగౌడ్, నర్సింలు గౌడ్‌ల స్కూటీని చెంగోల్ బైపాస్‌రోడ్డు వద్ద శుక్రవారం లారీ ఢీకొనడంతో మృతి చెందిన విషయం తెలిసిందే. లారీ డ్రైవర్ మైనొద్దీన్ మద్యం తాగి లారీ నడపడం వల్లే ప్రమాదం జరిగిందని.. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

డ్రోన్ సాయంతో పిచికారీ చేసేందుకు వచ్చి..

కారులో చెలరేగిన మంటలు



కారులో చెలరేగుతున్న మంటలు

పరిగి: మొక్క జొన్న పంటకు డ్రోన్ సాయంతో పిచికారి చేసేందుకు వచ్చిన వారి కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని లక్నాపూర్‌కు చెందిన కుర్వ రాములు, ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన డ్రోన్ నిర్వాహకులను తన మొక్కజొన్న పంటకు మందు పిచికారీ చేసేందుకు శనివారం పిలిపించాడు. దీంతో వారు సాయంత్రం పొలంలో డ్రోన్‌తో పిచికారి చేస్తుండగా ఒక్కసారిగా కారు లో మంటలు చెలరేగాయి. రైతు లు, బాధితులు కలిసి బిందెలతో నీళ్లు కారుమీద పోసి మంటలను అదుపు చేశారు. అప్పటికే కారు పూర్తిగా కాలిపోయింది. కారులో డ్రోన్‌కు సంబంధించిన ఛార్జింగ్ బ్యాటరీ ఉండటంతోనే మంటలు వచ్చి ఉంటాయని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

రాజేంద్రనగర్: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసి శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి చెందిన నవీన్ 2 కిలోల గంజాయితో లక్ష్మీగూడ నుంచి జల్‌పల్లికి వెళ్తున్నాడు. సమాచారం అందుకున్న రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు లక్ష్మీగూడ వద్ద నవీన్‌ను అదుపులోకి తీసుకుని సోదా చేయగా 2 కిలోల గంజాయి లభించింది. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి శంషాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించండి



తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు: రంజాన్ ఏర్పాట్లపై సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బీఎంఆర్

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

తాండూరు: రంజాన్ ఉపవాస దీక్షలకు ప్రార్థన మందిరాల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తాండూరు క్యాంపు కార్యాలయంలో అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రార్థన మందిరాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. అవసరమైన చోట విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఉపవాస దీక్షలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులతో చెప్పారు. పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు శాంతి భద్రతలను పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ రవిగౌడ్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, పట్టణ సీఐ సంతోష్, మత పెద్దలు అబ్దుల్ రవూఫ్, కమల్‌అతార్, సర్దార్‌ఖాన్, జుబేర్‌లాల, అబ్దుల్ ఖవి, జలాల్ పాల్గొన్నారు.

ప్రయోగాలు చేయడం అభినందనీయం

విద్యార్థులు శాస్త్రవేత్తలను తలపించేలా వినూత్నంగా ప్రయోగాలు చేయడం అభినందనీయమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలోని విశ్వవేద స్కూల్లో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విద్యార్థులు చేసిన ప్రయోగాలను వీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం సీఎం సహాయనిధి

సీఎం సహాయ నిధి ద్వారా ఎంతో మంది పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి ద్వారా 77 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.33లక్షల చెక్కులను పంపిణీ చేశారు.

ఐదేళ్లలోపు 20వేల ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే

తాండూరు రూరల్: తాండూరు నియోజకవర్గానికి రాబోయే ఐదేళ్లలోపు 15వేల నుంచి 20 వేల వరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని, దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన చెన్‌గేస్‌పూర్ గ్రామ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెన్‌గేస్‌పూర్ గ్రామానికి 144 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. సోమవారం నుంచి లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించొచ్చన్నారు. 72 గజాలలోపు ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. బేస్‌మెట్ పూర్తయిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా రూ.1 లక్ష జమ అవుతాయన్నారు. ఆ తర్వాత కూడా రెంటల్ లెవన్, స్లాబ్, ప్లాస్టింగ్, కలర్ దశల్లో విడతల వారీగా డబ్బులు జమఅవుతాయని తెలిపారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తోందన్నారు. ఇంటి బిల్లు ఇస్తామని ఎవరైన దళారులు లంచం అడిగితే ఇవ్వొద్దని హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్మిస్తున్న మోడల్ హౌస్ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ రవిగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప, ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఎంపీఓ సుశీల్, నాయకులు ధారాసింగ్, ప్రభాకర్‌గౌడ్, పట్లోళ్ల నర్సిములు, వడ్డెశ్రీను, శ్రీశైలంగౌడ్, వెంకటేశం, రాజుగౌడ్, మల్లప్ప, ప్రవీణ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

మండల విద్యాధికారి విజయరామారావు

- ఉత్సాహంగా కుదురుమల్ల ఉన్నత పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దుద్యాల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి విజయరామారావ్ అన్నారు. మండల పరిధిలోని కుదురుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన స్కూల్ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పూర్తి స్థాయిలో విషయ పరిజ్ఞానం అందించడం నిష్ణాతులైన ప్రభుత్వ టీచర్లకే సాధ్యమని తెలిపారు. రాష్ట్రంలో ఉత్తమ ప్రతిభ ను కనబరుస్తున్న వారిలో సర్కారు బడుల విద్యార్థు లే ముందుంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థు లు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కొడంగల్, బొంరాస్‌పేట్ ఎంఈఓలు రాంరెడ్డి, హరిలాల్, రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సలహాదారు వెంకట్‌రెడ్డి, హెచ్‌ఎం సాయన్న, ఉపాధ్యాయులు వేణుగోపాల్, తిరుపతి, నిరంజన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్, మాజీ సర్పంచ్ అనిత, గ్రామస్తులు రఘుపతి, రమేశ్‌గౌడ్, జనార్దన్‌గౌడ్, లాలప్ప, నర్సిములు, యాదవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పంపిణీ చేయాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటయ్య

పరిగి: నిరుపేదల కోసం నిర్మించిన డబుల్‌బెడ్‌రూంలను వెంటనే పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు రూ.10లక్షలు ఇవ్వాలని, ఇంటిస్థలం లేని వారికి స్థలం ఇచ్చి ఇంటిని నిర్మింపజేయాలన్నారు. పరిగి, దోమ, కుల్కచర్ల మండలాల్లో డబుల్ బెడ్‌రూంలను నిర్మించి నిరుపయోగంగా ఉంచారన్నారు. మున్సిపాలిటీలో కలిపిన గ్రామాల్లో కూడా ఉపాధి హామీ పనులను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని కూలీలకు తాగునీరు, టెంట్లు వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సత్తయ్య, హబీబ్, యావయ్య, రఘురాం, చెన్నయ్య, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరాడాలి



నూతన కమిటీ సభ్యులతో అబ్దుల్ వాహబ్

మైనారిటీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్

కొడంగల్ రూరల్: హక్కుల కోసం పోరాడి సాధించుకోవాలని మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ వాహబ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఉర్దూ ఘర్ ఫంక్షన్ హాల్లో సమితి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నుంచి కార్పొరేషన్ వరకు ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో ముస్లింల అభివృద్ధికి 12శాతం నిధులు కేటాయించాలని తదితర డిమాండ్ల సాధనకు మైనారిటీ నాయకులు కృషిచేయాలని కోరారు. అనంతరం పార్టీ నియోజకవర్గ, మండల, పట్టణ కమిటీలను ఏర్పాటుచేశారు. కొడంగల్ నియోజకవర్గ కన్వీనర్‌గా ఎఫ్ఎస్ సలాం, కో కన్వీనర్‌గా మహమ్మద్ సీరాజ్, కొడంగల్ మండల కమిటీ కన్వీనర్‌గా మొహమ్మద్ హకీమ్, కో కన్వీనర్‌గా మహమూద్, పట్టణ కన్వీనర్లుగా మొహమ్మద్ రఫీక్, మొహమ్మద్ నజీర్, కో కన్వీనర్‌గా అబ్దుల్ రావుఫ్‌లతోపాటు దౌల్తాబాద్, కోస్గి మండలాల కమిటీలను ఎన్నుకున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మొహమ్మద్ వసీమ్, నియోజకవర్గ మైనార్టీ నాయకులు డాక్టర్ నవాజ్, మహమ్మద్ ఫహీం పాల్గొన్నారు.

గర్భిణులకు కుళ్లిన కోడిగుడ్ల పంపిణీ



కుళ్లిన కోడిగుడ్డు



ప్రభుత్వ ముద్రతో గుడ్డు

కుల్కచర్ల: చౌడాపూర్ మండలం విఠలాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులకు కుళ్లిన కోడిగుడ్లు పంపిణీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామానికి చెందిన వడ్డె అనితకు అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులు గుడ్లు పంపిణీ చేశారు. సదరు గర్భిణి గుడ్డు తినేందుకు తీయగా కుళ్లిపోయి కనిపించింది. ఈ విషయాన్ని అంగన్‌వాడీ అధికారుల దృష్టికి తేగా గుడ్లు ఏజెన్సీల వస్తాయని తనకు ఎటువంటి సంబంధం లేదని సమాధానం ఇచ్చారు. జిల్లా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధారూరు: మండల కేంద్రంలోని కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయంలో (సీఆర్‌టీ) కాంట్రాక్ట్ పద్ధతిలో బయాలజీ బోధించేందుకు పోస్టు ఖాళీగా ఉందని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్రవంతి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, అనుభం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఈడీతో బయాలజీకల్ సైన్స్, టెట్ ఉత్తీర్ణులైన మహిళ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. 6 నుంచి పదోతరగతి విద్యార్థినులకు బోధించగలిగే అనుభవం ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్ సర్టిఫికేట్లతో తనను సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ నెల 3వ తేదీ వరకు దరఖాస్తులను అందజేయాలని కోరారు.

నాపరాతి గని గ్రామాల్లో నిప్పుల కొలిమి

ఇంటినుంచి బయటకు రాని పరిస్థితి

తాండూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం ఎండలు మండిపోయాయి. ముఖ్యంగా నాపరాతి గనుల గ్రామాలు మల్కాపూర్, కోటబాసుపల్లి, సంగెంకలాన్, ఓగిపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. నాపరాతి గనుల్లో కార్యకలపాలు ఉదయం మాత్రమే కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఎండల తీవ్రత కారణంగా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. మార్చి మొదటి వారంలో ఇలా ఉంటే ఏప్రిల్, మేలో ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు. వాతవారణ నిపుణులు మాత్రం ఉదయం, సాయంత్రం పనులను ముంగించుకోవాలని సలహా ఇస్తున్నారు.

పుట్టింటికి వెళ్లిన భార్య రావడంలేదని..

మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య

ధారూరు: పుట్టింటికి వెళ్లిన భార్య రావడం లేదని మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ధారూరు మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకోగా శనివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ అనిత తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట గ్రామానికి చెందిన తెలుగు ఆనంద్(28)కు కుమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన మనిలతో 4 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి 18 నెలల పాప ఉంది. కాగా సంసార విషయంలో ఆనంద్, మనిల తరుచూ గొడవపడుతుండేవారు. 3 నెలల క్రితం భర్తపై కోపంతో మనిల పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య ఇంటికి రావడం లేదని ఆనంద్ మద్యానికి బానిసైపోయాడు. ఈ క్రమంలో భార్య ఎంతకు రాకపోవడంతో మనస్తాపానికి గురై ఆనంద్ శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి మాణిక్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిత తెలిపారు.

చిట్టీల పేరుతో మోసం

ప్రభుత్వ ఉపాధ్యాయుడితో పాటు అతని భార్య రిమాండ్

ఆమనగల్లు: చిట్టీలు వేయడంతో పాటు అధిక వడ్డీ పేరుతో అమాయక ప్రజలను మోసం చేసిన ఆమనగల్లు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాలాది కిశోర్, అతని భార్య శ్రీలక్ష్మిని శనివారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. చిట్టీలు పూర్తయిన తర్వాత సభ్యులకు డబ్బులు ఇవ్వకుండా, అధిక వడ్డీ ఆశచూపి తమవద్దే పెట్టుకునేవారు. డబ్బులు అడిగినవారికి వివిధ కారణాలు చెబుతూ ఇబ్బందులు పెట్టారు. ఈ నేపథ్యంలో విసుగు చెందిన కొందరు బాధితులు వీరిపై ఆమనగల్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో భార్యాభర్తలను అదుపులోకి తీసుకుని విచారించగా, సుమారు కోటి రూపాయలకు పైగా ప్రజలను మోసం చేసినట్లు అంగీకరించారు.

పరీక్షలంటే భయం వీడాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీస్ అధికారులు

కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కల్పించిన సీఐ శ్రీధర్ రెడ్డి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్ఐ యాదగిరి

దుద్యాల్: మార్చి నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్న సందర్భంగా విద్యార్థులు పరీక్షలపై భయం వీడాలని కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, దుద్యాల్ ఎస్ఐ యాదగిరి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చెట్టుపల్లి తండా కస్తూర్బగాంధీ బాలిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరీక్ష కాలంలో విద్యార్థులు కొంత ఆందోళనకు, భయానికి లోనై పరీక్షలకు దూరంగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. పరీక్షలంటే భూతంగా చూడడం మాని స్వేచ్ఛగా, ధైర్యంగా చదువుకుని పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దని సూచించారు. పరీక్షలకు వెళ్లిన సందర్భంలో ఆకతాయిలు ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే తమతమ ఉపాధ్యాయులకు గానీ, పోలీసులకు గానీ సమాచారం చేరవేయాలన్నారు. ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటే వెంటనే పోలీసుల దృష్టికి సమస్య తీసుకెళ్లాలన్నారు. అనంతరం వారు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని నిర్వాహకులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ రాధిక రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మొయినాబాద్: భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మొయినాబాద్‌కు చెందిన మంగళి సురేష్‌కుమార్ (45) కటింగ్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారి ఇద్దరి కూతుళ్లను సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టళ్లలో చేర్పించాడు. సురేష్‌కుమార్ కొంత కాలంగా మద్యం తాగి భార్య సంధ్యతో గొడవపడుతున్నాడు. వారం రోజుల క్రితం ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న సురేష్‌కుమార్ మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తమ్ముడు నరేష్ ఇంటికి వచ్చి తలుపులు తీసి చూసే సరికి సురేష్‌కుమార్ వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక..

కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నమంగళారంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం చిన్నమంగళారం గ్రామానికి చెందిన వడ్డె నర్సింలు (65) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 17 ఏళ్లుగా భార్య, పిల్లలు నగరంలో ఉంటున్నారు. శుక్రవారం రాత్రి నర్సింలు భోజనం చేసి ఇంట్లో పడుకున్నాడు. శనివారం ఉదయం 6 గంటలకు నర్సింలు సోదరుడు రాజు నిద్రలేపడానికి వెళ్లగా అప్పటికే నర్సింలు ఉరివేసుకుని కనిపించాడు. కొంత కాలంగా నర్సింలు కడుపునొప్పితో బాధపడుతున్నాడని.. బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి
- కొమరబండ ఆలయ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ

షాబాద్: ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తామని శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ పామెన భీంభరత్ అన్నారు. శనివారం నిర్వహించిన కొమరబండ బుగ్గరామేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన వారు మాట్లాడుతూ..భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్ధార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంటారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌గా చేవెళ్ల వెంకటయ్య

బుగ్గరామేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా చేవెళ్ల వెంకటయ్య, వైస్ చైర్మన్‌గా మాధవరెడ్డి, సభ్యులుగా సత్యనారాయణ, రాణి, సునీత, శ్రవణ్‌కుమార్‌తో ఆలయ కమిటీ పరిశీలకులు మోహన్‌రెడ్డి, ఈఓ శ్రీనివాసులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వెంకయ్య మాట్లాడుతూ.. చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించిన అందరికీ రుణపడి ఉంటానని తెలిపారు. గ్రామం నుంచి ఆలయం వరకు రహదారి, వీధి దీపాల ఏర్పాటుకు కృషిచేస్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

స్కూటీని లారీ ఢీకొట్టడంతో ఘటన

ఇబ్రహీంపట్నం: అదుపుతప్పిన లారీ వెనక నుంచి స్కూటీని ఢీకొట్టిన ఘటనలో ఓ బీటెక్ విద్యార్థి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం సరూర్‌నగర్ మండలం బైరామల్‌గూడ, సాగర్ ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీలో నివసించే కొంతం మనోజ్‌రెడ్డి(19) తన స్నేహితుడు అన్వేష్‌రెడ్డితో కలిసి స్కూటీపై మంగల్‌పల్లి సమీపంలోని భారత్ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్తున్నారు. తుర్కయంజాల్ ఆరోగ్య ఆస్పత్రి వద్దకు రాగానే డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా అదుపు తప్పిన లారీ (టీఎస్02యూసి1631) వెనక నుంచి వీరిని ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన మనోజ్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా అన్వేష్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. ఈసమయంలో రోడ్డు పక్కన ఉన్న మరో గుర్తు తెలియని వ్యక్తికి సైతం గాయాలయ్యాయని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మహిళా సాధికారతకు తోడ్పడాలి

జేఎన్‌టీయూ డైరెక్టర్ సింధు



జేఎన్‌టీయూ డైరెక్టర్ సింధుకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి

మొయినాబాద్: గ్రామీణ మహిళ సాధికారత సాధించాలంటే ప్రభుత్వాలు తోడ్పాటునందించాలని జేఎన్‌టీయూ డైరెక్టర్ సింధు అభిప్రాయపడ్డారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా సాధికారతపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు ప్రభుత్వాలతోపాటు విద్యా సంస్థలు పరిశోధనలు చేయాలని.. వినూత్న కార్యక్రమాలు చేపట్టి వారికి అండగా ఉండాలన్నారు. సామాజిక అభివృద్ధి, మహిళా సాధికారత, పేదరిక నిర్మూలన, ఆరోగ్యం, విద్య, సామాజిక అంశాలపై పరిశోధనలు, అవగాహన సదస్సులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమాలకు ఐసీఎస్ఎస్ఆర్ సహకారం అందిస్తుందన్నారు. అనంతరం సదస్సులో పాల్గొన్న ప్రముఖ నిపుణులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థుల, పరిశోధకులు వారు రూపొందించిన అంశాలు, అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ డైరెక్టర్ బి.సుధాకర్‌రెడ్డి, ఓయూ సూపరింటెండెంట్ జాకబ్ కర్లి, ప్రొఫెసర్ సూర్యనారాయణ, ఆర్కిటెక్ట్ మేధ నవీవదేకర్, సుగంధ, ప్రతిభ, విజయ, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు జయహరి, ఉదయశ్రీ, చందన, సుచి శ్వేత, సారిక పాల్గొన్నారు.